క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, యామాపూర్, వేములకుర్తి సబ్‌స్టేషన్ల పరి ధి లోని గ్రామాలకు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ శుక్రవారం ఓ ప్రకటనతో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలన్నారు.

బతుకమ్మ సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న కళాశాల చైర్మన్

జగిత్యాల: రామకృష్ణ డిగ్రీ కళాశాలలో చదువుతున్న డిగ్రీ విద్యార్థి పూలవేని సంధ్య పాడిన బతుకమ్మ సీడీని కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాయకుడు మహిపాల్, ప్రిన్సిపాల్ మునీందర్ రెడ్డి తదితరులున్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా


బుచ్చిరెడ్డి

గొల్లపల్లి: మండల బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి పార్టీకి రాజీనామా చేస్తూ 11వ వార్డు సభ్యుడు గురిజాల బుచ్చిరెడ్డి రాజీనామా చేశారు. కొన్ని కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్ని రోజులు తనకు సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం


సునీల్‌ను అభినందిస్తున్న ఏబీవీపీ నాయకులు

కోరుట్ల: పట్టణ ఏబీవీపీ కార్యదర్శిగా మాడవేని నరేశ్‌ను నియమించినట్లు జిల్లా ఏబీవీపీ కన్వీనర్ రాపాక సాయికుమార్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా నరేశ్‌ను ఏబీవీపీ కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో పట్టణ జయింట్ సెక్రటరీ మాసం వినయ్, అభిమన్యు, మనోజ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో డ్రైడే



రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మురుగుకాలువల్లో చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, కార్యదర్శి అక్బర్, కారోబార్ రాజేందర్ పాల్గొన్నారు.

నందగిరిలో బీఆర్ఎస్ ప్రచారం

పెగడపల్లి: మండలంలోని నందగిరిలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ఈశ్వరన్న కార్యక్రమం పేరిట గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు, కేసీఆర్ సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, గంగాధర్, శోభ, నిర్మల, రాజిరెడ్డి, మమత, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే తనిఖీలు


వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణకే విస్తృత వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలం తిమ్మాపూర్ చౌరస్తాలో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమాలు జరగకుండా పోలీసు శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఏఎస్సై శంకరయ్య, సిబ్బంది ఉన్నారు.

రోడ్లు దుమ్ముమయం.. కష్టంగా ప్రయాణం

- దూరభారం తగ్గించేందుకు లింకురోడ్లు
- వర్షాకాలంలో కాలినడకన వెళ్లలేని దుస్థితి
- వేసవిలో దుమ్ముతో అవస్థలు
- లింకురోడ్ల అభివృద్ధికి మోక్షమెన్నడో ?
- తారురోడ్లుగా మార్చాలని కోరుతున్న వాహనదారులు, ప్రయాణికులు


లక్ష్మీదేవిపల్లి శివారు నుంచి అర్పపల్లి గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు

సారంగాపూర్: గ్రామాల మధ్య దూరం తగ్గించేందుకు గతంలో ఏర్పాటు చేసిన లింకురోడ్ల అభివృద్ధికి మోక్షం లభించడం లేదు. గ్రామాల నుంచి ప్రధాన రహదారుల గుండా వెళ్లేందుకు ఎక్కువ సమయం పట్టడంతో రైతులు, భూ యజమానులను ఒప్పించి అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు పొలాల మధ్య భూసేకరణ జరిపారు. ఉపాధిహామీ పథకం, పనికి ఆహారపథకం వంటి కార్యక్రమాల కింద ఈ భూముల గుండా అప్పుడు మట్టిరోడ్లను నిర్మించారు. కొన్నిరోడ్లను కంకర రోడ్లుగా మార్చారు. గ్రామాల మధ్య దూరం తగ్గించేందుకు ఏర్పాటు చేసిన లింకురోడ్లను పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి తీసుకువచ్చారు.

వాహనదారుల ఇబ్బంది

వర్షాకాలంలో లింకురోడ్లపై వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా కాలినడకన వెళ్లడం కూడా కష్టంగా మారుతోంది. వేసవిలో దుమ్ముతో అవస్థలు పడుతున్నారు.

లింక్‌రోడ్ల వివరాలివే..

✦ లక్ష్మీదేవిపల్లి నుంచి అర్పపల్లి గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని పొలాల మధ్యనుంచి లింక్‌రోడ్డును ఏర్పాటు చేశారు. ఇది రెండు గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల దూరం తగ్గిస్తుంది. ఈ రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు రూ.42 లక్షలతో ప్రతిపాదనలు పంపారు.

✦ బట్టపల్లి నుంచి మోహన్‌రావుపల్లెకు వెళ్లే రోడ్డు కిలోమీటరు ఉండగా, సగం సీసీరోడ్డు వేశారు. మిగిలిన రోడ్డు కేవలం కంకరతో ఉంది. మోహన్‌రావు పల్లె నుంచి పంటపొలాలకు వెళ్లే మరో రోడ్డుకు కేవలం వంతెన నిర్మాణానికి రూ. 65 లక్షలు మంజూరుకాగా పనులు ప్రారంభం కాలేదు.

✦ నాగునూర్ నుంచి ఎస్సారెస్పీ డి-53 ప్రధాన కాలువ మీదుగా రాయికల్ మండలం ఆలూరు వైపు వెళ్లే దారి మూడు కిలోమీటర్లు మట్టిరోడ్డుగా ఉంది.

✦ పోతారం - రేచపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డును ఆనుకొని తలుపులతండా గిరిజన గ్రామానికి వెళ్లే దారి కంకరరోడ్డుగా ఉంది.

✦ పెంబట్ల గ్రామం నుంచి ఊరచెరువు మీదుగా పంట పొలాల మీది నుంచి రంగపేట ఆర్అండ్‌బీ రోడ్డు (పెద్దమ్మ అమ్మవారి ఆలయం) వరకు 2.50 కిలోమీటర్లు మట్టిరోడ్డుకు రూ. 1.30 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కాలేదు.

✦ రంగపేట నుంచి బతుకమ్మ కుంట మీదుగా ఆలూరు రోడ్డు వరకు బీటీ ఏర్పాటుకు రూ. 56 లక్షలు మంజూరయ్యాయి. కానీ పనులు ప్రారంభం కాలేదు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఒడ్డెరకాలనీ గ్రామానికి ఉన్న మట్టిరోడ్డును తారురోడ్డు వేసేందుకు రూ.64 లక్షలు మంజూరుకాగా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

✦ రేచపల్లి ఆర్అండ్‌బీ రోడ్డునుంచి తలుపుల తండాకు వెళ్లే రోడ్డుకు వంతెన నిర్మాణానికి రూ.65 లక్షలు మంజూరుకాగా పనులు ప్రారంభించారు. రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలి.

✦ రంగసాగర్-మంగేళ గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చేందుకు రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

✦ తుంగూర్-దొంతాపూర్ గ్రామాల మధ్య తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాలి.

తారురోడ్లుగా మార్చాలి



లింక్‌రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లింకురోడ్లను తారురోడ్లుగా మార్చితే ప్రజలకు దూరభారం తగ్గడంతోపాటు, సమయం ఆదా అవుతుంది.

– పొలగాని మల్లేశం, బట్టపల్లి

ప్రతిపాదనలు పంపాం



అన్ని లింక్‌రోడ్లను తారురోడ్లుగా మార్చేందుకు నిధుల మంజూరుకోసం ప్రతిపాదనలు పంపాం. ఇందులో కొన్ని రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల తర్వాత పనులు ప్రారంభిస్తాం.

– భూపతి, ఏఈ పీఆర్

విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు


రాయికల్: బతుకమ్మలతో టీచర్లు


మల్యాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


జగిత్యాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి కళాశాలలో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, లైబ్రేరియన్ సంపత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి, రుమానా, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర ప్లేస్కూల్‌లో..

జిల్లా కేంద్రంలోని రవీంద్ర ప్లేస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

మల్యాల: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు, ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ ఆడారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోతె శివ రామకృష్ణ, అత్తినేని శ్రీనివాస్, మహమ్మద్ నవాబ్, యముల శ్రీనివాస్, దమ్మయ్యగారి శ్రీకాంత్, బాసని నరేశ్, గగడం రచన, పురాణం శ్రీధర్, కేశవేని శ్రీనివాస్, నగునూరి పూర్ణిమ, సంధ్య, ఆరె రాము, అత్తరి భాను, పొన్నం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రగతి ఉన్నత పాఠశాలలో..

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ బాలె జయశ్రీ, డైరెక్టర్ నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం


పోతారంలో ప్రచారం చేస్తున్న లోక బాపురెడ్డి

కథలాపూర్: అన్నివర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ధ్యేయమని, వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని పోతారం గ్రామ శివారులో లొంక రామేశ్వరస్వామి దేవాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ ధర్మపురి జలందర్, అల్లూరి జనార్దన్ రెడ్డి, పానుగంటి రాజు పాల్గొన్నారు.

శరన్నవరాత్రోత్సవాలకు వేంకటేశ్వరాలయం ముస్తాబు



కోరుట్ల : పట్టణంలోని అతి పురాతనమైన వేంకటేశ్వర ఆలయం దసరా శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆదివారం సూర్యప్రభా వాహనంపై వేంకటేశ్వర స్వామి దర్శనమిస్తాడు. సోమవారం చంద్రప్రభా వాహనంపై, మంగళవారం గజ వాహనం, బుధవారం శేష వాహనం, గురువారం సింహ వాహనం, శుక్రవారం గరుడ వాహనంపై, శనివారం పొన్నచెట్టు వాహనంపై, ఆదివారం ఆంజనేయ వాహనం, సోమవారం అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక అధికారి తెలిపారు.

మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల రూరల్: నియోజకవర్గంలో మార్క్‌ఫెడ్ ద్వారా మక్కకొన్న కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయపోవడంతో రైతులు పంటను దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతారన్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, నయీం, అమరేందర్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాలరూరల్: మండలంలోని నర్సింగాపూర్ గ్రామ శివారులోని జగిత్యాల మున్సిపాలిటీ డంపింగ్‌యార్డును తొలగించాలని గ్రామపంచాయతీ పాలకవర్గం శుక్రవారం ఏకగ్రీవ తీర్మానం చేయడంతో పాటు, సర్పంచ్ గడ్డం సరోజన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 437/112/1లో 10 ఎకరాల 20 గుంటల భూమిని జగిత్యాల మున్సిపల్‌లో సేకరించిన తడి, పొడి చెత్త వేసేందుకు డంపింగ్‌యార్డుకు కేటాయించారు. కొద్దిరోజులుగా డంపింగ్‌యార్డులో తరుచూ చెత్తకు నిప్పు పెడుతుండగా పొగ కమ్ముకొని గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే డంపింగ్‌యార్డును తొలగించాలని కోరారు.

దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించాలి

పెగడపల్లి: దివ్యాంగులు, 80ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటినుంచే ఓటువేసే అవకాశం కల్పించనున్నారని మండల ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎంపీ ఫరూక్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలు, సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల వివరాలను ఇంటింటా సర్వేచేసి గుర్తించాలన్నారు. సెక్టోరియల్ అధికారులు పుల్లయ్య, మహేందర్, ఆదిత్య, ఆర్ఐ అనిల్, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని గ్రామాల్లో వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లను గుర్తించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మల్లాపూర్ తహసీల్దార్ ఎల్. వీర్‌సింగ్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీవో కృపాకర్, ఏవో దీపిక, ఆర్ఐలు ఎస్. రమేశ్, గంగాధర్, బీఎల్‌వోలు, పంచాయతీల కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ప్రచారం


ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


క్రాకర్స్ పేల్చుతున్న ఎమ్మెల్యే సంజయ్


మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఖరారు కావడంతో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కాలనీల్లో ఇంటింటా తిరుగుతూ మహిళలను ఓట్లు అభ్యర్థిస్తుండగా బీఆర్ఎస్ అభ్యర్థి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సైతం ప్రతి వార్డుల్లో సమావేశాలు పెడుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఇంటింటి ప్రచారం..

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారంలో భాగంగా విస్తృత ప్రచారం చేశారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో వెళ్తూ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతూ ప్రజలను కోరుతున్నారు.

అభివృద్ధి చేశాం.. మళ్లీ అవకాశమివ్వండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మ్యాడంపల్లి, మానాల, తక్కళ్లపల్లి, లంబాడిపల్లి, తాటిపల్లి, సర్వాపూర్, గుడిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద హనుమాన్ ఆలయంగా కొండగట్టును అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలో నెర్రెలుబారిన నేలలు సీఎం కేసీఆర్ దృఢ సంకల్పంతో నేడు మూడు పంటలు పండే సారవంతమైన భూములుగా మారాయని, ఎటు చూసినా పచ్చని పొలాలే కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు గంగామహేశ్వరి, నలాల్ల లక్ష్మీ బుచ్చయ్య, ఎడిపెల్లి రాజన్న, హన్మాండ్లు, కట్కూరి తిరుపతి, జెడ్పీటీసీ కొండపల్కల రాం మోహన్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘దళిత బంధు’ పేరుతో మోసం చేశారు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్: దళితబంధు పేరుతో మంత్రి కొప్పుల ఈశ్వర్ దళితులను మోసం చేశారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని రాంనూర్ సర్పంచ్ బోడుక మంజుల బీఆర్ఎస్ నుంచి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. సర్పంచ్‌తో పాటు సుమారు వందమంది గ్రామస్తులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పేదలకు ఇవ్వాల్సిన దళితబంధును బీఆర్ఎస్ నాయకులు, వారి బంధువులకు ఇచ్చి అర్హులైన దళితులను మంత్రి మోసం చేశారన్నారు. సీఎం కేసీఆర్ దళిత సీఎం హామీని తుంగలో తొక్కారని, దళితులకు మూడెకరాల భూమి అటకెక్కిందని, డబుల్ బెడ్ రూం ఇళ్ల ఊసే లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సోనియా ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. ఒక్కసారి తనకు అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, వెల్గటూర్ సర్పంచ్ మురళిగౌడ్, ఎంపీటీసీ మంజుల, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రావు, ఉప సర్పంచులు సందీప్, కుమారస్వామి, నాయకులు గెల్లు శ్రీనివాస్, సందీప్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, సాగర్, తిరుపతి, హరీశ్, సంజీవ్, మహేశ్, అశోక్, బైరంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడిని ఉరితీయాలి

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్


మాట్లాడుతున్న విజయ్ కుమార్

గొల్లపల్లి: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడిని ఉరితీయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గ్రామంలోని బాధిత చిన్నారుల కుటుంబాలను పరామర్శించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విజయ్‌కుమార్ ద్వారా చిన్నారుల కుటుంబాలతో ఫోన్‌లో మాట్లాడారు. వృద్ధుడికి కఠిన శిక్షపడేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా నక్క విజయ్‌కుమార్ మాట్లాడుతూ అధికార బలంతోనే ఇలాంటి చర్యలకు గతంలోనూ పాల్పడినట్లు తెలిసిందన్నారు. పోలీసులు దీనిని సీరియస్‌గా తీసుకోవాలని, లేకపోతే వృద్ధుడికి శిక్షపడేంత వరకు బీఎస్పీ పోరాటం చేస్తుందన్నారు. ఇక్కడ మండల అధ్యక్షుడు కల్లెపల్లి తిరుపతి, ఉపాధ్యక్షుడు సామల శ్రీకాంత్, దేవేందర్, శేఖర్, స్వామి, తిరుపతి, శేఖర్, తిరుపతి అంజి తదితరులున్నారు.

ఎంపీవో బదిలీ

కథలాపూర్: మండల పంచాయతీ అధికారి గంగాధర్ బదిలీ అయ్యారు. గంగాధర్ అదిలాబాద్ జిల్లా డీఆర్డీవో కార్యాలయం ఏవోగా బదిలీపై వెళ్లారు. మండల ఇన్‌చార్జి ఎంపీవోగా మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ తౌఖీర్ అహ్మద్‌కు బాధ్యతలు అప్పగించారు.